క్లుప్తంగా

పీహెచ్‌సీ ఏర్పాటుకు స్థలం పరిశీలన

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని సింగితం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అధికారులు, నాయకులు ప్రభుత్వ స్థలాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని రైతువేదిక సమీపంలోని 157 సర్వే నెంబరులోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ విజయ్ కుమార్, ఆర్ఐ ప్రభాకర్, సర్వేయర్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్, మండల, యూత్ అధ్యక్షులు అంజయ్య, నర్సింహులు, ప్రభాకర్, నాయకులు శశికాంత్ పాటిల్, రాజు, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలోని 261 సర్వే నంబర్‌లోని అసైన్డ్ భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గంగాభవాని, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, శిఖం భూముల్లో నిర్మాణాలు చేపడితే సహించేదిలేదని హెచ్చరించారు.

చోరీ సొత్తు స్వాధీనం

మునిపల్లి(అందోల్): కోహీర్ గ్రామానికి చెందిన నాగరాణికి బుదేరా ఎస్ఐ సురేష్ బ్యాగ్, ఫోన్, ఆధార్‌కార్డుతో పాటు రూ.1.170 నగదును అందజేశారు. సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన కంకోల్ సంతలో నాగరాణి కూరగాయలు కొనుగోలు చేస్తున్న సమయంలో బ్యాగ్ పోగొట్టుకుంది. దీంతో బాధితురాలు మీ–సేవలో సీఈఐఆర్ వెబ్‌సైట్‌కు దరఖాస్తు చేసుకొని బుదేరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు (సీఈఐఆర్) సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటీ రిజిష్టర్) ఐడీ ద్వారా ఫోన్ సిగ్నల్ తెలుసుకుని సంబంధిత వ్యక్తి నుంచి బ్యాగ్‌తో పాటు ఫోన్, నగదు, తదితర వస్తువులను తీసుకుని నాగరాణికి అప్పగించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

నారాయణఖేడ్: మండల పరిధిలోని జూకల్ తండా, వెంకటాపూర్ గ్రామాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్యానల్ న్యాయవాదులు అలిగే జీవన్‌కుమార్, సాయిలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కోర్టు సిబ్బంది సంజీవ్, శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: తెలంగాణ ప్రోగెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో వచ్చే నెల ఫిబ్రవరిలో ఖమ్మంలో నిర్వహించనున్న విద్యా, వైజ్ఞానిక మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆ సంఘం నాయకులు మొగుడంపల్లి ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ మొగుడంపల్లి మండల అధ్యక్షుడు కిష్టయ్య మాట్లాడుతూ ఖమ్మంలో ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. టీపీటీఎఫ్ నాయకులు జగదీశ్వర్, ఇర్షాద్, నీలకంఠయ్య స్వామి, ప్రకాష్, ఆంజనేయులు, సాంబశివుడు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన వాటర్ వర్క్స్ కార్మికుడి సతీమణి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత, కౌన్సిలర్ జ్యోతి శ్రీకాంత్‌రెడ్డి కలిసి బాధిత కుటుంబానికి గురువారం రూ.50వేల నగదు అందజేశారు. మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ల చోరీ

పటాన్‌చెరు టౌన్: నిర్మాణ దశలో ఉన్న భవనంలోకి ఓ వ్యక్తి ప్రవేశించి విద్యుత్ వైర్లను దొంగిలించాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కాలనీలో నివాసముండే రమేష్ ఇల్లు నిర్మాణ దశలో ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి నిర్మాణ దశలో ఉన్న ఇంటిలోకి ఓ వ్యక్తి ప్రవేశించి విద్యుత్ వైర్లను దొంగిలించాడు. మళ్లీ అదే వ్యక్తి బుధవారం అర్ధరాత్రి కూడా దొంగతనానికి వచ్చి విద్యుత్ వైర్లను దొంగిలించాడు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా దొంగ వచ్చిన వీడియోలు లభించాయి. దీంతో ఇంటి యజమాని రమేష్ పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యాచకుడి మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కన గురువారం గుర్తు తెలియని యాచకుడు మృతి చెందాడు. సదాశివపేట ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి వయస్సు సుమారు 65 ఏళ్లు ఉంటాయన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 9440939262ను సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారం మరువలేనిది
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఘనపూర్ గ్రామంలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో రూ.4.50 కోట్ల నిధులతో నిర్మించిన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా పదేళ్ల పాటు విద్యారంగాన్ని బలోపేతం చేశామన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 7000 మంది విద్యార్థులకు వచ్చే నెల మొదటి వారంలో మోటివేషనల్ క్లాసులను నిర్వహిస్తామన్నారు. ప్రతి విద్యార్థికి విద్యాసామగ్రిని అందిస్తామని తెలిపారు. పాఠశాలల నిర్మాణానికి సహకరించిన గ్లాండ్ ఫార్మా పరిశ్రమ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సీఎస్ఆర్ విభాగం అధిపతి రఘురామన్, ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్ కావ్య, ఎంపీటీసీ నీనా, మాజీ సర్పంచ్ విఠలయ్య, ఎంఈఓ రాథోడ్, రాఘవేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్ నాయక్, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు నిర్వహించాలి

అయోధ్యలో నూతనంగా నిర్మించిన భవ్య రామ మందిరాన్ని ఈ నెల 22న ప్రారంభించనున్న సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని కోదండ సీతారామస్వామి దేవాలయంలో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. కోదండ సీతారామస్వామి ఆలయంలో గురువారం ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్ సపనా దేవ్, పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

పటాన్‌చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ సుష్మశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, కార్పొరేటర్లు కుమార్‌యాదవ్, పుష్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని మార్కెట్ రోడ్డులో ఉన్న హజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్ షహీద్ దర్గా ఉత్సవాలను ఈ నెల 22నుంచి నిర్వహించనున్న సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట కార్పొరేటర్ కుమార్ యాదవ్, విద్యుత్ శాఖ ఏడీ దుర్గాప్రసాద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, దర్గా కమిటీ సభ్యులు వాజిద్‌అలీ, లియాకత్‌అలీ, హమీద్, ఖాదర్‌అలీ, మసూద్, ఇమ్రాన్, అజ్మత్, ఇర్షాద్, అలీబాబా ఉన్నారు.

క్రీడలకు కేంద్రంగా మైత్రి మైదానం

దశాబ్దాల చరిత్ర కలిగిన మైత్రి మైదానాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మైత్రి క్రీడా మైదానంలో 34వ మైత్రి ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ సుష్మశ్రీ , కార్పొరేటర్లు కుమార్‌యాదవ్, పుష్ప, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ సపనాదేవ్, ఎస్సార్ గ్రూప్స్ ఎండీలు సత్యనారాయణరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఎస్సార్ ట్రస్ట్ అధ్యక్షుడు గోదావరి అంజిరెడ్డి, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి,శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, క్రికెట్ క్లబ్ సభ్యులు, సీనియర్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

తహసీల్దార్ రవికుమార్

జిన్నారం(పటాన్‌చెరు): అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ రవికుమార్ అన్నారు. మండల పరిధిలోని ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని ఆయా పరిశ్రమల్లో కార్మికులకు, ఉద్యోగులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయించుకునేవిధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ, ఆయా పరిశ్రమల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో...

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి అన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా మండల పరిధిలోని మద్దికుంట శివారులో ఉన్న ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో ఓటరు నమోదు, ఓటుహక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఓటుహక్కు వజ్రాయుధం వంటిదని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రాధాన్యతపై వ్యాసరచన పోటీలు...

జోగిపేట(అందోల్): జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఎన్నికల అధికారి ఆదేశానుసారం 'నా ఓటు నా భవిష్యత్తు–ఓటు ఒక శక్తి' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవిరాజు, అకాడమిక్ కోఆర్డినేటర్ గోపాల్, అధ్యాపకులు అనసూయ, పండరి తదితరులు ల్గొన్నారు.

ఎస్ఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో...

ఝరాసంగం(జహీరాబాద్): ఓటుహక్కు ప్రాధాన్యతను తెలియజేస్తూ ఝరాసంగం మండల కేంద్రంలో ఎస్ఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు మారుతి విఠోబా, రాజ్ కుమార్, బాలకృష్ణ, యాసిన్, రామ్ చందర్ భీమ్ వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.


ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు



2కే రన్‌లో పాల్గొన్న పోలీసులు, అధికారులు



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిరుధాన్యాల సాగుతో ఉపయోగకరం

- డీడీఎస్ సూపర్‌వైజర్ బాలయ్య
- పాత పంటల జాతరకు ఘన స్వాగతం

జహీరాబాద్: చిరుధాన్యాల సాగుతో అన్ని విధాలుగా ఉపయోగం ఉంటుందని డీడీఎస్ సూపర్‌వైజర్ బాలయ్య అన్నారు. మండలంలోని శేఖాపూర్ గ్రామానికి గురువారం పాతపంటల జాతర ఎడ్లబండ్లు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామ రైతులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బాలయ్య మాట్లాడుతూ చిరుధాన్యాలను సాగు చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు పశువులకు మేత, భూమి సారవంతమవుతుందన్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఈ పంటలు పండుతాయని తెలిపారు. ఎవరికైనా విత్తనాలు అవసరం ఉంటే అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ నర్సింహులు, డీడీఎస్ సభ్యులు విజయలక్ష్మి, మంజుల, వినయ్‌కుమార్, బాలయ్య, జనరల్ నర్సమ్మ, చుక్కమ్మ, అల్గోల్ నర్సమ్మ, చంద్రమ్మ, లక్ష్మమ్మ, పూలమ్మ పాల్గొన్నారు.


పాత పంటల జాతర ఎడ్లబండ్లకు స్వాగతం పలుకుతున్న మహిళా రైతులు

ఆలయ ఆవరణలో శుభ్రత పనులు

నారాయణఖేడ్: ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆలయాల శుద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం ఖేడ్‌లోని కాశీనాథ్ ఆలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని బీజేపీ నాయకులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, నాయకులు సంజీవ్‌పటేల్, రాజుగౌడ్, పట్నం మాణిక్, సంతోష్ రాథోడ్, సంతోష్‌కుమార్, సుగుణాకర్, సాయేందర్, లోకేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఎమ్మెల్యే అభినందన

నారాయణఖేడ్: శాసన మండలి ఎన్నికల్లో ఎమ్మెల్యే విభాగంలో ఎమ్మెల్సీలుగా నామినేషన్లు దాఖలు చేసిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు బల్మూరి వెంకట్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్‌ను గురువారం హైదరాబాద్‌లో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు అన్వేష్ రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్ ఎమ్మెల్సీ అభ్యర్థులను కలిసి అభినందించారు.

వివాహితను వేధించిన వ్యక్తికి రిమాండ్

పటాన్‌చెరు టౌన్: వివాహితను వేధిస్తున్న వ్యక్తిని గురువారం రిమాండ్‌కు తరలించారు. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నారం మండలానికి చెందిన మహిళ తన కుటుంబంతో పటాన్‌చెరులో నివాసం ఉంటోంది. అయితే ఆమెను కొంత కాలంగా బీహెచ్‌ఈఎల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న జిన్నారం మండలం శివానగర్‌కు చెందిన సాయికుమార్ నిన్ను ప్రేమిస్తున్నానని, నీ భర్త, పిల్లలను వదిలేసి వస్తే పెళ్లి చేసుకుంటానని తరచూ వేధించేవాడు. అంతేకాకుండా భర్త, పిల్లలను చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయగా సాయికుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మహాసభలను విజయవంతం చేయండి

సంగారెడ్డి అర్బన్: వచ్చే నెల ఫిబ్రవరిలో 11,12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్యయాదవ్, సోమశేఖర్, గోవింద్‌రెడ్డి, నాగేశ్వర్, సునీతాఖన్నా, జీవంరావు, రాజారెడ్డి, భాస్కర్, పాల్గొన్నారు.

నియామకం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ గొర్రెల పెంపకందారుల సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా చదువు మల్లేశంను ఎన్నికల అధికారి చిన్నారావు సమక్షంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ గొల్ల, కురుమల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఒగ్గు శ్రీనివాస్, డైరెక్టర్లు గొల్ల దశరథ్, పెద్దగొల్ల నర్సమ్మ, ఒగ్గు మల్లేశం, తొగర్పల్లి రాజు, కురుమ సంఘం పెద్దలు తొగర్‌పల్లి మల్లయ్య, ఒగ్గు నర్సింహులు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


మల్లేశంకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి చిన్నారావు

గ్రామాల అభివృద్ధిపై సమావేశం

కంది(సంగారెడ్డి): 2024–25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై గ్రామ సభల్లో చర్చించి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీఓ మహేందర్‌రెడ్డి అన్నారు. గ్రామాల అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించుకునే అంశంపై పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ ఈ నెల19, 20 తేదీల్లో అన్ని గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఏపీఓ గురుపాదం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీఓ మహేందర్‌రెడ్డి

చెరకు పంట సాగుపై అవగాహన


రైతులతో మాట్లాడుతున్న చక్కర ఫ్యాక్టరీ ప్రతినిధులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మామిడ్గి, ఖలీల్‌పూర్ గ్రామంలో చెరకుపంట సాగుపై రాయికోడ్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గోదావరి గంగా ఆగ్రో ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ చక్కెర పరిశ్రమ యాజమాన్యం అవగాహన కల్పించింది. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి మహేష్‌కుమార్, కేన్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, కార్యక్రమంలో ఫ్యాక్టరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

జహీరాబాద్: టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రాంనగర్ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్, సురేష్, రాంచందర్, ఎన్టీఆర్ అభిమానులు ఆంజనేయులు, శివన్న, జైపాల్, నాగరాజ్, లక్ష్మణ్, సయ్యద్ జమీర్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మీర్ఖాన్‌పేటలో నారాయణఖేడ్ డివిజన్ స్థాయి ఎన్‌పీఎల్ టీ–10 క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను గురువారం నిర్వహించారు. ఫైనల్‌లో కల్హేర్, మనూర్ మండలాల జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో కల్హేర్ మండలం జట్టు విజయం సాధించింది. సామాజికవేత్త హన్మంత్‌రెడ్డి, రాపర్తి సర్పంచ్ శ్రావణ్‌కుమార్ కలిసి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కల్హేర్ మండల జట్టుకు ట్రోఫీతో పాటురూ.30వేల చెక్కును అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన మనూర్ మండల జట్టుకు ట్రోఫీతో పాటు రూ.15వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అలె భాస్కర్, నిర్వాహకులు యాకోబ్, రవి, నాందేవ్, రాములు పాల్గొన్నారు.



ట్రోఫీని అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి, భాస్కర్

వ్యక్తి అదృశ్యం

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని మేళసంగ్యం గ్రామానికి చెందిన మెట్టు నాగరాజు ఈ నెల 7వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో నాగరాజు భార్య ప్రియాంక ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం బుదేరా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నాగరాజు ఆచూకీ తెలిసినవారు ఫోన్ నెంబర్ 8712656749కు సమాచారం ఇవ్వాలని సూచించారు.


నాగరాజు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మునిపల్లి(అందోల్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండల పరిధిలోని పొల్కంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రమేశ్ (34) బుధవారం సాయంత్రం బైక్‌పై బుదేరా గ్రామానికి వెళ్లి తిరిగి పొల్కంపల్లికి వస్తుండగా పెద్దగోపులారం గ్రామ శివారులోకి రాగానే కల్వర్టుకు ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.


రమేశ్(ఫైల్)

అయోధ్యకు వెళ్లిన సంగ్రాం మహారాజ్

నారాయణఖేడ్: అయోధ్యలోని శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠలో పాల్గొనేందుకు అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు ఆహ్వానం మేరకు అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్, ఇరక్‌పల్లి దేవిదాస్ మహారాజ్‌తో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లోని భవానీమాత ఆలయంలో అయోధ్యకు వెళ్తున్నవారిని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పత్తిరి రామకృష్ణ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల భూములను పరిరక్షించండి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని హిందూ దేవాలయాలను పరిరక్షించాలని కోరుతూ బీజేపీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని దేవతలగుట్టలో హిందూ దేవాలయాలు ఉన్నాయన్నారు. అయితే ఈ దేవాలయాల భూములను ఆక్రమించేందుకు కొంతమంది యత్నిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఆలయాల భూములను పరిరక్షించేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు